
VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 07-04-2024 సంపుటి : 06 సంచిక : 207 పేజీలు : 8 వెల : రూ 3-00

# చంద్రబాబు అంటే అబద్ధాలు..మోసాలు ..కుట్రలు

**14 ఏళ్ల కాలంలో ఒక్క మంచి పనయినా చేశారా**
**మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసే రకం బాబు**
**పేదల పక్షాన మంచి చేస్తున్న నాకు..చెడుకు మధ్య పోటీ**
**హామీలు నెరవేర్చిన జగన్‌నే ఆశీర్వదించండి**
**నెల్లూరు జిల్లాలో మేమంతా సిద్ధం సభలో జగన్ పిలుపు**





నెల్లూరు,ఏప్రిల్6 అబద్ధాలు, మోసం, కుట్రలన్నీ కలివి తే చంద్రబాబు అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇది మంచికి, మోసా నికి మధ్య జరుగుతున్న యుద్ధమని , మీరంతా సిద్ధామా అని సిఎం జగన్ అన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా 9వ రోజు శనివారం సాయంత్రం నెల్లూరు జిల్లా కావలి నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. మోసం చేయడమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య యుద్ధం అని, పెత్తందార్ల పక్షాన చంద్రబాబు ఉంటే, పేదల పక్షాన మీ బిడ్డ జగన్ ఉన్నాడని తెలిపారు. సినిమా విలన్ క్యారెక్టర్లు అన్నీ కలిపితే చంద్రబాబు అని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. మోసం, అబద్ధాలు, వెన్నుపోటు, కుట్రలు కలిపితే చంద్రబాబు అని అన్నారు. కావలిలో జన ప్రభంజనం కనిపిస్తోందని చెప్పారు. మోసగాళ్ల కూటమికి వ్యతిరేకంగా ఈ జిల్లా సిద్ధమంటోందని అన్నారు. విపక్షాల కుట్రలు, కుతంత్రాలు చేధించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు మోసం చేసే చంద్రబాబు, ప్రజలకు మధ్య యుద్ధమని జగన్ అన్నారు. ఈ యుద్ధంలో తాను ఎప్పుడూ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. మోసగా ళ్లంతా చంద్రబాబు పక్షమేనని పేర్కొన్నారు. సినిమా విలన్ క్యారెక్టర్లు అన్నీ కలిపితే చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. మోసం, అబద్ధాలు, వెన్నుపోటు, కుట్రలు కలిపితే చంద్రబాబు అని విమర్శించారు. విశ్వసనీయత, ధర్మాన్ని గెలిపించేం దుకు సిద్ధంగా ఉండాలని పిలుపుని చ్చారు. పేదలకు చంద్రబాబు చేసిన ఒక్క మంచి పనిచెప్పాలని జగన్ సవాలు విసిరారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తొస్తుందా? అని నాలుగు నెలలుగా ప్రశ్నిస్తు న్నానని జగన్ తెలిపారు. వీటికి చంద్రబాబు సమాధానం చెప్పడం లేదని చెప్పారు. చంద్రబాబు మూడుసార్లు రంగు రంగుల మేని ఫెస్టో చూపించారని విమర్శించారు. ఒక్కసారైనా హామీలు అమలు చేశానని చెప్పారా? అని ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు మేనిఫెస్టోను పట్టించుకోరని విమర్శించారు. మేనిఫెస్టో చూపించే దమ్ము, ధైర్యం ఉందా అని చంద్రబాబును ప్రశ్నించారు. మేనిఫెస్టోల కనీసం 10 శాతమైనా అమలు చేశారా అని నిలదీశారు. చంద్రబాబు ఈ ప్రశ్నలకు ఎప్పటికీ సమాధానం చెప్పలేదని విమర్శించారు.ప్రజలతో చంద్రబాబుది అతకని బంధం అని జగన్ అన్నారు. 14 ఏండ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మార్క్ ఏంటి అని ప్రశ్నించారు. మోసాలు, వెన్నుపోట్లతో చంద్రబాబు 14 ఏండ్లు సీఎంగా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికీ చేసిన పనులు చెప్పుకునే దమ్ము చంద్రబాబుకు లేదని అన్నారు. మంచి చేసి ఉంటే 3 పార్టీలతో పొత్తు ఎందుకు అని ప్రశ్నించారు.అందరి ప్రయోజనాలు రక్షించు కునేందుకు, మంచిని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమా?. ఈ యుద్ధంలో నేను ఎప్పుడూ పేదల పక్షమే. మోసగాళ్లంతా కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. మంచి చేసిన మనకు మద్దతిచ్చేందుకు మీరంతా సిద్ధమా?. మరో 5 వారాల్లోనే ఎన్నికలు జరగబోతున్నాయి. పేదల భవిష్యత్‌ను నిర్ణయించేది ఈ ఎన్నికలే. మీ బిడ్డ హయాంలో ప్రతి ఇంటికి మంచి జరిగింది. జరిగిన మంచి కొనసాగించేందుకు మీరంతా సిద్ధమా?' అంటూ ప్రజలను ఉద్దేశించి అన్నారు. 14 ఏళ్లు సిఎంగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు పేరు చెప్తే ఒక పథకం కూడా గుర్తుకురాదు. బాబు పేరు చెప్తే పేదలకు చేసిన మంచి ఒక్కటి లేదు. మ్యానిఫెస్టో కాపీలు చూపించే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. 30 ఏళ్ల క్రితమే సీఎంగా చేసిన చంద్రబాబు.. నా గతాన్ని చూసి ఓటేయండి అని అడగలేరు. మ్యానిఫెస్టోలోని 10 శాతం హామీలైనా అమలు చేశానని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా అంటూ సీఎం జగన్ ప్రశ్నించారు. ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం కూడా చంద్రబాబుకు లేదు. చంద్రబాబు అభివృద్ధి చేసి ఉంటే పొత్తు ఎందుకు?. ఎన్నికలొస్తే ప్రజలను మభ్యపెడుతూ ముందుకొస్తాడు. బెంజ్ కారు, బంగారం ఇస్తానంటూ మభ్య పెడతాడు. పేదవాడికి మంచిచేసానని ఏరోజైనా చంద్రబాబు చెప్పగలిగాడా?. నా ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేదు అంటూ దెప్పిపొడుపులు పొడిచారు. రూ.2 లక్షల 70వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. ఒక్కసారి ఆశీర్వదించినందుకే 58 నెలల పాటు సంక్షేమం అందించా. 99 శాతం హామీలు నెరవేర్చి మళ్లీ ఆశీస్సులు కోరుతున్నా. మీ జగన్ ఇంటించికి పౌరసేవలు డోర్ డెలివరీ చేయిస్తున్నాడు. చంద్రబాబును నమ్మడమంటే పులినోట్లో తలపెట్టడమే' అని సీఎం జగన్ ధ్వజమెత్తారు. 2014లో ఇదే కూటమి ఇంటింటికీ పంపించిన పాంప్లెట్ గుర్తుందా?. ముఖ్యమైన హామీలు అంటూ మోసపు మాటలు గుర్తున్నాయా?. రైతులకు రుణమాఫీ చేస్తానన్నాడు.. చేశాడా?. పొదుపు సంఘాల రుణమాఫీ చేస్తానన్నాడు చేశాడా?. ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తానన్నాడు చేశాడా?. ప్రతి నగరంలో హైటెక్ సిటీ అన్నాడు.. నిర్మించాడా?. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించాం. 99 శాతం హామీలు నెరవేర్చి మళ్లీ మీ ముందుకు వచ్చా. నిలబడండి. మరో ఐదేళ్ల పాటు మంచి కొనసాగాలంటే మీరు తోడుగా ఉండాలి. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేస్తేనే ఇంటింటి అభివృద్ధి జరుగుతుంది. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలు చెప్పండి. మళ్లీ మోసం చేసేందుకు బాబు కొత్త మేనిఫెస్టోతో వస్తున్నాడు. సూపర్ సిక్స్, సెవెన్ అంటున్నాడు.. నమ్మొద్దని సీఎం జగన్ చెప్పారు.

# హత్యకేసు నిందితుడికి టిక్కెట్ ఎలా ఇస్తారు

**బిజెపి దగా చేస్తున్నా ఎందుకు పట్టుకుని వేలాడుతున్నారు**
**ముస్లింలను మోసం చేసిన .జగన్, చంద్రబాబు**
**కడప ప్రచారంలో పిసిసి చీఫ్ షర్మిల**




కడప,ఏప్రిల్6 : వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డికి సీఎం జగన్ టికెట్ ఎలా ఇస్తారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. కడపలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమె పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడారు. వివేకా కేసులో అవినాశ్‌ను సీబీఐ నిందితుడిగా తేల్చిందన్నారు. బాబాయి హత్య విషయంలో జగన్ ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కోరారు. హత్య రాజకీయాలను ప్రోత్సహించే వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీబీఐ నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డికి మళ్లీ ఎలా టిక్కెట్ ఇచ్చారని ప్రశ్నించారు. బాబాయి హత్య విషయంలో జగన్ ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. సీబీఐ విచారణ ఎందుకు వద్దన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరం చేయకపోతే విచారణకు ఎందుకు అడ్డుపడుతున్నారని ఆక్షేపించారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహించే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కడప ప్రజలకు అందుబాటులో ఉంటా.. వైఎస్సార్ లాగా సేవ చేస్తా అని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ముస్లింలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిన జగన్.. ఒక్కటైనా నెరవేర్చారా?. ముస్లింల పక్షాన నిలబడేది కాంగ్రెస్ మాత్రమే. స్థానిక ఎంపీ అవినాష్ రెడ్డి ఒక్క రోజు కూడా కడప స్టీల్ ఎ÷-లాంట్‌పై మాట్లాడలేదు. కడప ప్రజలకు నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటా. వైఎస్సార్‌లా సేవ చేస్తానని షర్మిల అన్నారు.జగన్మోహన్ రెడ్డి బీజేపీకి బానిస షర్మిల అన్నారు. గోద్రాలో దాడులు జరిగితే జగన్ నోరు విప్పలేదని మండిపడ్డారు. బీజేపీ అంటేనే గిట్టని వైఎస్సార్ కు బీజేపీకి బానిస అయిన జగన్ వారసుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. ముస్లింలకు ఎన్నో వాగ్దానాలు చేసిన జగన్ వారిని దారుణంగా మోసం చేశారని ఆక్షేపించారు. ఇమామ్ లకు రూ.15 వేలు వేతనం, ముస్లిం బ్యాంక్, చనిపోతే రూ.5 లక్షల బీమా వంటి ఎన్నో హామీలు ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారని ఆరోపించారు. చంద్రబాబు, జగన్ ఇద్దరు ముస్లింల పక్షాన లేరన్న షర్మిల.. కాంగ్రెస్ మాత్రమే ముస్లింలకు భరోసా ఇస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందని వీళ్ళు బానిసలు అయ్యారు. విభజన హామీలు ఒక్కటీ బీజేపీ నెరవేర్చలేదు, హోదాపై బీజేపీ మోసం చేసింది. వైఎస్సార్ బతికి ఉంటే కడప స్టీల్ ఎప్పుడో పూర్తి అయ్యేది. కడప స్టీల్ ను శంకుస్థాపన ప్రాజెక్ట్ గా మార్చారు. మూడు సార్లు శంకుస్థాపన చేసి ఎంపీలు నిద్రపోతున్నారు. ప్రస్తుత ఎంపీ అవినాష్ రెడ్డి ఒక్క రోజు కూడా కడప స్టీల్ గురించి మాట్లాడలేదు. కడప - బెంగళూర్ రైల్వే లైన్ వైఎస్సార్ ఆశయం. కానీ ఆ లైన్ ను జగన్ వద్దన్నారు.

# నమాజ్ నుంచి వస్తున్న యువతిపై దాడి

**వైకాపా తీరుపై మండిపడ్డ అచ్చన్నాయుడు**

అమరావతి,ఏప్రిల్6 నంద్యాలలో నమాజ్ చేసుకొని వస్తున్న ముస్లిం యువతిని వైసీపీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అవమానించడాన్ని టీడీపీ తీవ్రంగా ఖండిస్తుందని ఏపీ టీడీపీ చీఫ్ కింజరాపు అచ్చెన్నా యుడుఅన్నారు. శనివారం మీడి యాతో మాట్లాడుతూ.. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింల పై దాడులు చేయడం సిగ్గుచేటని మండి పడ్డారు. ముస్లింల ద్రోహి జగన్ రెడ్డి అని, ముస్లింలపై జాతి అహంకార ంతో జగన్ రెడ్డి అండ్ కో విర్రవీగుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముస్లింలను నమ్మకూడదు' అని ముస్లిం జాతిని అవమానించిన వైసీపీకి ఓటుతో బుద్ధిచె ప్పాలని పిలుపునిచ్చారు. మొన్న శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో వైసీపీ అభ్యర్థి బంధువు వహీద అనే ముస్లిం మహిళపై చెప్పుతో దాడి చేశారని గుర్తుచేశారు. అలాగే గతంలోను వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకుం దన్నారు. ఐదేళ్లల్లో ముస్లింలపై 60కి పైగా దాడులు, 15 మందికి పైగా అత్యాచా రాలు, 9 మందిపై హత్యలు, వేలాది మందికి అవమానాలు జరిగాయన్నారు.

# రఘురామకు ఉండి టిక్కెట్ ఖరారు



**టిక్కెట్ కేటాయిస్తూ చంద్రబాబు నిర్ణయం**
**బాబు నిర్ణయంపై ఉండిలో టిడిపి శ్రేణుల నిరసన**

భీమవరం,ఏప్రిల్6 టీడీపీలో చేరిన రఘురామకృష్ణం రాజుకు టికెట్ ఖరారు అయ్యింది. చంద్రబాబు ఆయనకు ఉండి నియోజకవర్గాన్ని కేటాయించారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే చంద్రబాబు నిర్ణయంపై ఆగ్రహంగా ఉన్నారు. ఎంపీగా గెలిచి.. ఐదేళ్లపాటు వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చిన ఆయన శుక్రవారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు సమక్షంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. తొలుత ఆయన ఎంపీగా పోటీ చేస్తారని భావించినా.. వీలు కాకపోవడంతో టీడీపీ నుంచి ఉండి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే.. ఉండి నియోజకవర్గానికి తొలుత రామరాజు పేరును టిడిపి ప్రకటించింది. తాజాగా సమీకరణల నేపథ్యంలో ఆ టికెట్‌ను రామరాజుకు కాదని.. రఘురామకృష్ణం రాజుకు ప్రకటించింది టీడీపీ అధిష్టానం. 2019లో రఘురామకృష్ణం రాజు వైసీపీ నుంచి నరసపురం ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఏకంగా సొంత పార్టీ అధిష్టానంపైనే అనేక విమర్శలు, ఆరోపణలు చేశారు. దాంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది వైసీపీ అధిష్టానం. అయినప్పటికీ.. అటు పార్టీకి రాజీనామా చేయకుండా.. ఇటు వేరే పార్టీలో చేరకుండా ఉంటూ వచ్చారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటం.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవడంతో రఘురామకృష్ణం రాజు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నాడు టీడీపీలో చేరారు. వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకు ఉండి నుండి టికెట్ కేటాయించటంతో టీడీపీలో అసమ్మతి సెగ రగిలింది. తనను కాదని రఘురామకు టికెట్ కేటాయించటంపై సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు చంద్రబాబు కాన్వాయ్ ని అడ్డుకొని నిరసన తెలియజేసారు .మంతెన రామరాజుకే టికెట్ కేటాయించాలని ఆందోళనకు దిగారు. రఘురామకు టికెట్ ఇవ్వటాన్ని సహించేది లేదని మండిపడ్డారు. మంతెన రామరాజును చంద్రబాబు నిండా ముంచారని అంటున్నారు ఆయన అనుచరులు. పార్టీలో చేరిన రఘురామకు 24గంటలు కూడా గడవక ముందే టికెట్ ఇచ్చి పార్టీని నమ్ముకొని ఉన్న మంతెనకు తీవ్ర అన్యాయం చేసారని మండిపడుతున్నారు కార్యకర్తలు.టీడీపీ నాయకులకు కాకుండా తన సొంత మనుషులకు,జనసేన, బీజేపీ నాయకులకే చంద్రబాబు టికెట్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. రఘురామకు టికెట్ అనౌన్స్ చేసిన వెంటనే నిరసన సెగ రాజుకున్న నేపథ్యంలో చంద్రబాబు పునరాలోచిస్తారా లేదా

# వైసిపికి షాక్ ఇచ్చిన ఎమ్మెల్యే బాబు

**కాంగ్రెస్‌లో చేరిక....అదే బాటలో యామినీ బాల**

కడప,ఏప్రిల్6 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పార్టీ ఫిరాయింపులు ఊపందుకున్నాయి.ముఖ్యంగాఅభ్యర్థుల జాబితా ప్రకటన విషయంలో, ప్రచారం విషయంలో దూకుడు ప్రదర్శిస్తున్న వైసీపీలో ఫిరాయింపులు కూడా గట్టిగానే జరుగుతున్నాయి. ఎన్నికల అభ్యర్థుల ప్రకటించిన తర్వాత వైసిపికి షాక్‌లు మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడి పక్క పార్టీల్లో చేరగా తాజాగా మరో



ఎమ్మెల్యే పార్టీకి గుడ్ బై చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ను గద్దె దించట మే లక్ష్యంగా పావులు కదుపుతున్న షర్మిల ఇప్పటికే పలువురు వైసీపీ కీలక నేతలను కాంగ్రెస్ లో చేర్చుకున్నారు. జగన్ కు బలమైన ఓట్ బ్యాంక్ గా ఉన్న ముస్లిమ్ మైనారిటీ,ఎస్సీ,ఎస్టీ సామాజికవర్గానికి చెందిన నాయకులను పార్టీలోకి చేర్చుకొని జగన్ విజయావకాశాలను దెబ్బ కొట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పూతలపట్టు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఎంఎస్ బాబు పార్టీని వీడటం చిత్తూరులో వైసీపీకి పెద్ద దెబ్బే అనే చెప్పాలి. అయితే బాబు బాటలోనే మాజీ ఎమ్మెల్యే యామినీ బాల కూడా రంగం సిద్ధం చేసుకున్నారు. ఉదయం పూతలపట్టు వైసీపీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతపురం సింగనమలమాజీ ఎమ్మెల్యే యామిని బాలవైసీపీకిరాజీనామా చేశారు.

# సంపాదకీయం

ఆదివారం 07-04-2024

## బలమైన విపక్షం కూడా అవసరమే!

ప్రజాస్వామ్యం బలంగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాలనుకుంటున్నా.. బలమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. బలంగా పోరాడడం లేదు. కనీసం ఇతర పక్షాలను కలుపుకుని పోవడంలోనూ వైఫల్యం కానవస్తోంది. ఇండియా కూటమిని బలంగా నిర్మించడం లోనూ విఫలమయ్యింది. దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా...ప్రతిపక్షాలు ఉమ్మడిగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీయలేక పోతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిగ్గదీయలేకపోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూడా పోటీని ఇచ్చేలా కనపడడం లేదు. ఎందుకంటే నితీశ్ మళ్లీ ఎన్డీఏ గూటికి చేరగా, మమతా బెనర్జీ సైలెంట్‌గా ఉన్నారు. కేజ్రీవాల్ జైలుకు వెళ్లారు. లా చెప్పుకుంటూ పోతే పెద్దగా బలమైన కూటమిగా కాంగ్రెస్ కానరావడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఆకర్శణీయమైన మేనిఫెస్టోను ప్రకటించింది. దీనిపై ప్రజలు ఎలా స్పందిస్తారన్నది చూడాలి. అయితే ప్రధాన సమస్యలను చర్చించడంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కూడా విఫలం అయ్యింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నిరుద్యోగం, జీఎస్టీ తదితర అంశాలపై స్పష్టత కానరావడం లేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా, తన పాత్రను బలంగా నిర్వహిం చలేక పోతున్నది. మిగతా పార్టీలను కలుపుకుని అధికారపార్టీ ఆగడాలను అడ్డుకోలేకపోతున్నది. ప్రజలను అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ విధానాలతో నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా పెట్రో ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిజానికి సమస్యలపై చర్చించే విషయంలో ఉమ్మడిగా పోరాడలేక పోతున్నాయి. నిజానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ దుస్థితి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. బలపడాలన్న కాంక్ష కనిపించడం లేదు. ప్రజల పక్షాన పోరాడాలన్న తపన కానరావడం లేదు. ఒకరకంగా ప్రతిపక్ష పార్టీ బలంగా లేకపోవడం వల్ల మోడీ ఆడింది ఆటగా సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తాము మరింత బలపడ్డామని, 400 సీట్లు సునాయాసంగా గెలుస్తామన్న ధీమా మోడీకి ఏర్పడింది. దీంతో మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఖాతరు చేయడం లేదు. వారు ఇచ్చే ఎలాంటి సూచనలను కూడా పరిగణించడం లేదు. ధాన్యం సేకరణపై జాతీయ విధానం కావాలని రైతులు పట్టుబట్టి పోరాడుతున్నా ఖాతరు చేయడం లేదు. దీనిని బట్టి రైతులపట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ ఉందో గమనించవచ్చు. బిజెపి అగ్రనేతలకు, దానిని సమర్థిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు కూడా ఇదే ధీమా ఏర్పడింది. పెట్రోలియం ధరలు ఎడాపెడా పెంచడం ఇందుకు సంకేతం. అయితే మోదీ నుంచి ఇంకా ఎటువంటి కీలక నిర్ణయాలు వెలువడ నున్నాయా అని భయపడవలసి వస్తోంది. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల ప్రైవేటీ కరణ,లేబర్ కోడ్‌ల అమలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణతో పాటు మరిన్ని ఆర్థిక సంస్కరణల విషయంలో మరింత వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నా రైతుల గురించి ఆలోచించే దాఖలాలు కనిపించడం లేదు. కనీస మద్దతుధరకు విలువ లేకుండా పోతుంది. మద్దతు ధరల కోసం రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదు. ఒంటరిగా పోరాడి నందున కాంగ్రెస్‌కు ఫలితం దక్కడం లేదు. ప్రధాన సమస్యలపై కలసికట్టుగా పోరాడేందుకు వ్యూహం పన్నడంలో రాహుల్, సోనియాలు పూర్తిగా విఫలం అవుతున్నారు. మోడీకి కూడా విపక్షాలు అంటే అలుసుగా మారింది. దేశం గురించి గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఇంగితాన్ని ప్రదర్శించడం లేదు. నేతలు ఎవరు కూడా మోడీకి భయపడి ఏమీ మాట్లాడడం లేదు. ఈ క్రమంలో దేశంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి ,మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి...వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయవిధానం, ఆహారపంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. సమస్యలను ఎత్తి చూపడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు..విభిన్న ఆహారపు అలవాట్లు ఉన్నందున.. ఏ ధాన్యం ఎక్కడ ఎంత అవసరమో ..దానికి అనుగుణంగా ఏ పంటలు అవసరమో కేంద్రం వద్ద ప్రణాళిక లేదు. సమస్యలపై సమగ్రంగా చర్చించాలన్న స్పృహ విపక్షాలకు లేదు. అధికారపక్షానికి అంతకకన్నా శ్రద్ధ లేదు. దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తూ.. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. ఈ సమస్యలపై మోడీ దాటవేత ధోరణితో దేశం తీవ్ర సమస్యను ఎదుర్కోనుంది. అలాగే నిలదీ యకపోవడం వల్ల విపక్షాలు బలహీనంగా మారనున్నాయి. కాంగ్రెస్ ఈ అవకాశాలన్నీ వినియోగించు కోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందనే చెప్పాలి. ఈ సమస్యలన్నీ ఎన్నికల ముందు చర్చించాల్సి ఉంది. అనేకానేక సమస్యలను ప్రస్తావించాల్సి ఉంది. విపక్షాలు కనీసం తమ ఎన్నికల ఎజెండాలో వీటిని పెట్టాలి. ప్రజలైనా ఆలోచన చేస్తారు.

# బీసీలతో పెట్టుకుంటే మీ పార్టీ పుట్టగతులు ఉండవు...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఏప్రిల్ 6 తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు శనివారం డోన్ పట్టణం లో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీలపై రోజురోజుకు జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూ ప్రస్తుతం ఈ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగాన్ని రచించుకొని రాజారెడ్డి రాజ్యాంగాన్ని సైకో ప్రభుత్వం అమలు చేస్తుంది. దానిలో భాగంగానే బీసీలపై రోజురోజుకు హత్యలు దాడులు ఎక్కువైపోతున్నాయి వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క బిసి తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి తెలుగుదేశం పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీసీల ప్రాణాలు తీస్తున్న జగన్ రెడ్డిని రాష్ట్రం నుండి తరిమికొడతాంజగన్ రెడ్డి అరాచకాలకు వంత పాడేందుకు నిరాకరించారని చోట చంద్రయ్య అనే బీసీని పట్ట పగలు,నడిరోడ్డుపై పీక కోసి హత మార్చారు. కంచర్ల జల్లయ్య, అమర్నాథ్ గౌడ్, ఏగిరెడ్డి కృష్ణ లాంటి ఎంతో మంది బీసీల ప్రాణాలను హరించారు. మొన్నటికి మొన్న కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో చేనేత వర్గానికి చెందినసుబ్బారావు ఆస్తులు లాక్కుని, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. తాజాగా.. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం యాదాపురంలో శ్రీనివాసులు అనే బీసీ ఆస్తిని జగన్ రెడ్డిమేనమామ రవీంద్రనాథ్ రెడ్డి ముఖ్య అనుచరుడు నాగపుల్లారెడ్డి కబ్జా చేసి, రెవెన్యూ అధికారులతోకలిసి రికార్డులు కూడా మార్చేశాడు .అధికారుల పై కలెక్టర్ కి ఫిర్యాదు చేశాడని పొలంలోనే హత్య చేశా రు. ఎస్సై సునీల్ రెడ్డితో కలిసి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిం చారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం బి సి ఎస్ సి ఎస్ టి మైనారిటీ సామాజిక వర్గాలను ఊచ కోత కోస్తుంది. అయ్యా జగన్ మోహన్ రెడ్డి గడిచిన ఈ ఐదు సంవత్సరంలలో మీ భూ,దన దాహం తీరలేదా. బీసీలపై కపట ప్రేమలు నటిస్తూ బీసీలను అన్ని విధాలుగా అనగ తొక్కుతూ, బీసీల పై కపట కన్నీళు రాల్చడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు ఇకపై మీ ఆటలు సాగవు రాబోయే ఎన్నికలలో బీసీలంతా ఏకమై మీకు ఖచ్చితంగా తగిన గుణపాఠం చెబుతారు అన్నారు ఈ కార్యక్రమంలో వలసల రామకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, రంగనాథయ్య, జనసేన బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఏప్రిల్ 6 డోన్ పట్టణం లో బిజెపి పార్టీ కార్యాలయం లో పార్టీ జండా ఎగరవేసి, పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడు తూ కోట్లాది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చడానికి అనుక్షణం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ,పార్లమెంట్ లో 2 సీట్లతో మొదలై నేడు పూర్తి మెజార్టీతో కేంద్రంలో,దాదాపు 20 రాష్ట్రాలలో ప్రజల ఆశీర్వాదంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై నిర్మితమై,దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతావాదానికి కట్టుబడిసమాజంలో చివరి వ్యక్తికి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ ఆచరిస్తూ,అటల్ జి, అద్వానీ జి తదితర అగ్రనేతల మార్గదర్శనంలోజగత్ ప్రకాష్ నడ్డా నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించినరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భరతమాతను విశ్వ గురువుగా నిలిపే యజ్ఞంలో భాగమైనభా రతీయ జనతా పార్టీ కార్యకర్తలుకు అభిమానులు కు,మద్దతుదారులకు భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోడి అశోక్ కుమార్, ప్యాపిలి మండలఅధ్యక్షులు దామోదర్నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబయ్య, మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్ర నాయుడు, బీజేపీ కార్యకర్తలు చరణ్, మల్లికార్జున, మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోమప్ప సర్కిల్ నుండి బస్టాండ్ వరకు స్వీప్ కార్యక్రమం పై అవగాహన ర్యాలీ..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 6 విభారె న్యూస్. ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్అధికారిటి. చిరంజీవి ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్ నుండి బస్టాండ్‌సర్కిల్‌వరకుస్వీప్ కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎన్ గంగిరెడ్డి, ఎమ్మిగనూరు తహశీల్దారు శేషా రెడ్డి,నందవరం తహశీల్దారు ఓబులేసు, సి.ఎం.ఎం. జయవర్దన్, మెప్మా సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఏప్రిల్ 6 డోన్ పట్టణం శ్రీనివాస నగర్లో గుర్తు తెలియని ఓ వృద్ధుడు ఎండవేడిమికి తట్టుకోలేక మూర్ఛ వచ్చి పడిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని అతడికి సాయం చేయండని స్థానికులు స్ఫూర్తి సేవా సమితి వారికి సమాచారం ఇవ్వగా స్పందించిన స్ఫూర్తి టీమ్ వృద్ధుడికి సపర్యలు చేసి వైద్య నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించగా అతడికి మెరుగైన వైద్యం కోసం కర్నూలు కి తీసుకెళ్లాలని డోన్ ఆసుపత్రి వైద్యులు సూచించగా ఆ వృద్ధుడిని ప్రభుత్వ అంబులెన్స్ లో కర్నూల్ కి తీసుకెళ్లి సర్వజన ఆసుపత్రిలో చేర్చి అతడికి మెరుగైన వైద్యం చేయించడం జరిగింది. అతను కోలుకున్నాకా ఒక మంచి ఆశ్రమంలో చేర్పిస్తామని సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మోహన్ రెడ్డి, అంజి, ప్రభుదాస్, హుసేన్, ద్రోణాచలం సభ్యుడు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06-: ఇంటింటి చెత్త సేకరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ విభాగం అధికారి లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలసి శనివారం ఉదయం. 1 - 8- 35- వార్డుల్లో శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

# షర్మిల ఓ పెయిడ్ ఆర్టిస్ట్

ఆమె తెలంగాణ నుంచి ఎందుకు మాయం అయ్యారు
షర్మిల చాలా సంజాయిషీలు వ్వాల్సి ఉంది
చంద్రబాబు కుట్రలు ప్రజలు గమనించాలి
రావణుడిలా వేషాలు మార్చి వస్తున్నారు
ఓటమి భయంతోనే పొత్తులకు సిద్ధం
జనసేన, బిజెపిల్లోనూ బాబు మనుషులకే టిక్కెట్లు
చంద్రబాబు కోసం పనిచేస్తున్న పురంధేశ్వరి
ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శలు



అమరావతి,ఏప్రిల్6 పీసీసీ చీఫ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పెయిడ్ ఆర్టిస్టుగా ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అభివర్ణించారు. తాడేపల్లిలోని వైసీపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ..కడప లోక్‌సభ బరిలోకి దిగిన షర్మిల తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డనని .. వైఎస్ అవినాష్ రెడ్డి వివేకాను చంపిన వ్యక్తి అని.. ఎవరికి ఓటు వేయాలో ఆలోచించాలని ప్రజల్ని కోరుతున్నారు. హంతకుల ప్రభుత్వం పోవాలంటే సీఎం జగన్ ను ఓడించాలని పిలుపునిస్తున్నారు. ఈ అంశంపై సజ్జల రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. షర్మిల ఇవ్వాల్సిన సంజాయిషీలు చాలా ఉన్నాయ న్నారు. తెలంగాణ నుంచి హఠా త్తుగా షర్మిల ఎందుకు మాయం అయ్యారని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఏపీ వచ్చి కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారని.. వాటిని ఎవరిచ్చారన్నారు. షర్మిల కాంగ్రెస్ బాధ్యతలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో కొట్లాడు తానని తెలంగాణలో పార్టీ పెట్టారని.. .ఇప్పుడు పెయిడ్ ఆర్టిస్ట్‌లాగా మాట్లాడుతున్నారని మండపడ్డారు. వివేకా హత్య కేసు గురించి నాలుగేళ్లుగా మాట్లాడని ఆమె.. ఇప్పుడెందుకు మాట్లాడుతున్నా రన్నారు. మరో నెలలో ప్రజాకోర్టులో ఇదంతా తేలుతుందన్నారు. మీడియా సమావేశంలో చంద్రబా బుపై విమర్శలు గుప్పించారు. జనసేన, బీజేపీలో ఉన్నవాళ్లకు నిరాశే కలిగిందని.. చంద్రబాబు ఎవరికి అనుకుంటే వాళ్లకు సీట్లు ఇచ్చేలా చేశారన్నారు. తన మనుషులకే టికెట్లు ఇప్పించుకున్నారు. బీజేపీలో కూడా బాబు చెప్పినట్లే సీట్లు ఖరారు అయ్యాయన్నారు. అయినా 2019 ఎన్నికలంటే టీడీపీ ఘోరంగా ఓడిపోబోతోందన్నారు. 2019లో అధికారంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు తీరు ఎలా ఉందో అందరికీ తెలుసు. ఆయన పాలనను ప్రజలు మరిచిపోలేదు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఈవో మీదకు దూకుడుగా వెళ్లారు. దబాయించి మాట్లాడా రన్నారు. చంద్రబాబు కక్షతో వలంటీర్ వ్యవస్థపై విష ప్రచారం చేసింది. ఇప్పుడు ఎన్నికల ముందు ఆ వ్యవస్థను దూరం చేసింది. తన ఏజెంట్ నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఫించన్లు, పథకాలు అందకుండా కుట్ర చేస్తోంది. వలంటీర్ వ్యవస్థ వల్ల రెండ్రోజుల్లో ఫించన్ల పంపిణీ పూర్తయ్యేది. కానీ, ఇప్పుడది ఆలస్యం అయ్యింది. దీంతో పెన్షనర్లలోనూ ఆందోళన వ్యక్తం అయ్యింది. దురదృష్టవశాత్తూ.. ఎండలకు తాళలేక కొందరు చనిపోయారు. అధికారులపైనా చంద్రబాబు అండ్ కో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు రాక్షస మనస్తత్వం ఏ నాయకుడిలో కనిపించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ వ్యవస్థ పారదర్శకంగా పని చేస్తోంది. కోవిడ్ సమయంలోనూ సీఎం జగన్ ఒక్క పథకం కూడా ఆపకుండా అందించారన్నారు. ఇకపోతే చంద్రబాబు తన కూటమిలోని వాళ్లనే చిన్న చూపు చూస్తున్నారని.. ఆయన వల్లే బీజేపీ, జనసేనకు అసలు ఉనికే లేకుండా పోయిందని రామకృష్ణారెడ్డి అన్నారు. ఓటమిని గ్రహించే చంద్రబాబు పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్నారని, ప్రజలకు సంక్షేమం అందకుండా కుట్రలు చేస్తున్నారని సజ్జల మండిపడ్డారు.

# ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హోదా

విజయవాడ, ఏప్రిల్ 6 ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఏపీలో ఓ అధికారికి ఐఏఎస్ హోదా కట్టబెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలు చర్చనీయాంశంగా మారాయి. ఏపీ సిఎంఓలో ముఖ్యకార్యదర్శి హోదాలో ఉన్న ధనుంజయ్ రెడ్డి ఓఎస్డీ గా పనిచేస్తున్న అధికారిణికి ఇటీవల ఏపీ టిడ్కో జనరల్ మేనేజర్ గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆరా తీసిన ఉద్యోగులు అసలు విషయం తెలిసి అవాక్కయ్యారు. 2023 స్టేట్ క్యాడర్ సర్వీస్‌లో భాగంగా సిఎం ముఖ్యకార్యదర్శి వద్ద ఓఎస్‌డిగా పనిచేసే అధికారిణి ఐఏఎస్ హోదా కల్పించే లక్ష్యంతో ఆమెకు అదనపు పోస్టింగ్ ఇచ్చినట్టు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా జీవో విడుదల చేసి ఆ హోదా మాటున కన్ఫర్డ్ హోదా కోసం దరఖాస్తు చేసినట్టు ఆరోపిస్తున్నారు. స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న మాధురి గత కొన్నేళ్లుగా సిఎంఓలో ఓఎస్డీ హోదాలో పనిచేస్తున్నారు. 2022కోటాలో భాగంగా 2023లో సిఎంఓలో ఓఎస్డీగా పనిచేసిన నీలకంఠారెడ్డికి ఐఏఎస్ హోదా లభించింది. 2023కోటాలో జి.మాధురి పేరును రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీకి సిఫార్సు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్నికల కోడ్ రావడానికి ముందే మార్చి 7నాటికి ఈ జాబితాను యూపీఎస్సీకి పంపినట్టు చెబుతున్నారు. స్టేట్ క్యాడర్ సర్వీస్ కన్ఫర్డ్ హోదాకు దరఖాస్తు చేయాలంటే దరఖాస్తుదారులు కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. సాధారణంగా స్టేట్ ఆడిట్ విభాగం ప్రాధాన్య ఉద్యోగాల జాబితాలోకి రాదని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓఎస్డీ హోదా మాత్రమే కన్ఫర్డ్ హోదా దరఖాస్తు చేసుకోడానికి అర్హతగా సరిపోవనే ఉద్దేశంతో ఏదొక కీలక పోస్టును కూడా వారికి కేటాయిస్తున్నారు. సిఎంఓలో విధులు నిర్వర్తిస్తూనే అదనపు పోస్టులో కొనసాగినట్టు కాగితాలపై సిఫార్సు చేస్తున్నారు. వాటి ఆధారంగా దరఖాస్తు చేస్తున్నారు. స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో హోదాలో ఉన్న మాధురిని ఏపీ టిడ్కో జిఎంగా నియమిస్తున్నట్లు ఫిబ్రవరి 29వ తేదీన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదేళ్లుగా ఏపీ టిడ్కో ఎలాంటి నిర్మాణ కార్యక్రమాలను చేపట్టకపోయినా టిడ్కోలో మాధురికి పోస్టింగ్ ఇవ్వడం కేవలం కన్ఫర్డ్ హోదా కోసమేనని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. పట్టణ గృహనిర్మాణం గురించి తెలుసుకునేందుకు జిఎం గా పనిచేసే అవకాశం కల్పించాలని ఫిబ్రవరి 26న ఆమె విజ్ఞప్తి చేయగానే అదే రోజు టిడ్కో ఎండీ అంగీకారం తెలుపుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. మూడ్రోజుల్లోనే జీవో జారీ అయ్యింది. సిఎం ముఖ్య కార్యదర్శి వద్ద ఓఎస్డీ హోదాలో పనిచేసే అధికారిణికి టిడ్కో జిఎంగా అదనపు పోస్టింగ్ ఇవ్వడంపై ఉద్యోగులు ఆరా తీయడంతో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. ఆమెకు ఐఏఎస్ హోదా కట్టబెట్టే ప్రయత్నాల్లో భాగంగానే జీవోలో జారీ చేయడం, యూపీఎస్సీకి సిఫార్సు చేయడం ఆగమేఘాలపై నడిచినట్టు తెలుస్తోంది. కన్ఫర్డ్ జాబితాలో గత ఏడాది ఐఏఎస్ హోదా పొందిన నీలకంఠారెడ్డి, పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ అనిల్ రెడ్డిలకు అవకాశం కల్పించారు. తాజాగా జి.మాధురి రెడ్డిని కూడా ఐఏఎస్‌గా చేయాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో రెవిన్యూయేతర విభాగాల్లో అన్ని విభాగాలకు సమాన అవకాశాలు కల్పించాల్సి ఉండగా స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఇద్దరికి ఐఏఎస్ హోదా కల్పించడంపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సిఎంఓకు రాకముందు ఓఎస్డీ మాధురి విశాఖలో విధులు నిర్వర్తించారు. విశాఖపట్నానికి చెందిన ప్రజాప్రతినిధి సిఫార్సుతో సిఎంఓలో ప్రవేశించినట్టు చెబుతారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లో ఓఎస్డీలుగా పనిచేస్తున్న ఇద్దరు అధికారులకు ఐఏఎస్ హోదా లభించింది. అప్పట్లో ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న ధనుంజయ్ రెడ్డి ఓఎస్డీ నీలకంఠరెడ్డితో పాటు పులివెందుల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న అనిల్ రెడ్డిలను ఎంపిక చేశారు. హోదా కోసం అర్హత కలిగిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన దాదాపు 40మంది అధికారులు కొద్ది నెలల క్రితం జిఏడికి దరఖాస్తు చేసుకున్నారు. వివిధ రకాల వడపోతల తర్వాత ఎంపిక ఉండటంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేసుకున్నారు. అన్ని దశలు దాటుకున్న తర్వాత ముఖ్యమైన వ్యక్తుల ఆశీస్సులు ఉన్న వారికే హోదా లభించినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రెండు పోస్టుల్లో ఒకే వర్గానికి ప్రాధాన్యత కల్పించడంపై ఇతర దరఖాస్తుదారులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పుడు అదే వర్గానికి అవకాశం దక్కుతుందనే ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. జిఏడి సర్వీసెస్ షార్ట్ లిస్ట్ చేసిన జాబితాను ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం డిఓపిటికి సిఫార్సు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిఎస్ ఎంపిక చేసిన జాబితాను సిఎంఓకు సిఫార్సు చేశారు. తుది జాబితాలో పేర్లు దక్కించుకున్న వారికి కన్ఫర్డ్ హోదాను కట్టబెట్టేందుకే టిడ్కో జిఎం పోస్టింగ్ ఇచ్చినట్టు ఆరోపిస్తున్నారు. కన్ఫర్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకునే నాన్ రెవిన్యూ అధికారులకు కనీసం మూడేళ్ల సర్వీసుతో పాటు కనీసం ఏడు క్రెడెన్షియల్స్ ఉండాలని చెబుతున్నారు. సర్వీస్ రికార్డు, పనితీరు ఆధారంగా ఎంపిక జరుగుతుంది. నాన్ స్టేట్ సివిల్ సర్వీసెస్ కింద ఐఏఎస్లుగా పోస్టింగ్లు ఇచ్చేందుకు 85 శాతం రెవెన్యూశాఖ వారిని, మిగిలిన 15 శాతం ఇతర శాఖల వారిని ఎంపిక చేస్తారు. కన్ఫర్డ్ సర్వీసెస్‌కు ఎంపిక చేసినపుడు రెవెన్యూ నుంచి వచ్చే వారికి మౌలిక పరీక్ష ఉండదు.

### నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ధ్యేయం మండలి బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ,గడిచిన అయిదేళ్లుగా వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వెనుకబాటు తనానికి గురైన అవనిగడ్డ నియోజక వర్గ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తా నని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు.. జనసేన పార్టీ లో చేరిన అనంతరం అవనిగడ్డ లో తొలి సారి మీడియా తో మాట్లాడారు. భయపెట్టి పాలన సాగుతోందని, ఎవరి కీ అభిప్రాయం చెప్పే స్వేచ్ఛ లేకుండా పోయిందని. చివరకు ప్రతిపక్షాల సమావేశాలకు వెళ్ళే వారిని బెదిరిం చడం చేశారని ఇలాంటి పాలనను అంత మొంది ంచిప్రతీ మనిషి స్వేచ్ఛను కాపాడటం,భయ రహితులను చేయ డం లక్ష్యమ న్నారు. ప్రభుత్వ కార్యాల యాలకు వెళ్ళే వారికి న్యాయం జరుగుతుందన్న నమ్మకం, ధర్మ బద్ధ పాలన ఇవ్వడం కూటమి లక్ష్యమని, ప్రజల అభిప్రాయాలు నా ఎజెండా అని అన్నారు. ఈ అయిదేళ్ళు ఏమి చరమగీతం పాడేందుకే టిడిపి, జనసేన, బీజేపీ ఏకమయ్యా యన్నారు.

# ఈసీకి కుప్పలు కుప్పలుగా ఫిర్యాదులు

విజయవాడ, ఏప్రిల్ 6 ఆంధ్రప్రదేశ్?లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో లోక్ సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతూ ఉండటంతో పగడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో వచ్చిన నాటి నుంచి ప్రత్యేక బృందాలతో ఎక్కడ ఎలాంటి గొడవలు గాని, హింసాత్మక ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే వాటిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తక్షణమే చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో జిల్లాల వారీగా కూడా చేస్తున్న ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటన కూడా చేస్తున్నారు. ఎన్నికల్లో శాంతిభద్రత సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఇప్పటికే రాష్ట్ర అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ఏర్పాటుతోపాటు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్?లు ఏర్పాటు చేశారు. అంతఃరాష్ట్ర సరిహద్దుల వద్ద కూడా తనిఖీలు మమ్మరం చేశారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులతో ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, డ్రగ్స్, బంగారాన్ని సీజ్ చేస్తున్నారు. ఇక రాష్ట్రంలో వివిధ కారణాల చేత ఆయుధాలు లైసెన్సులు తీసుకున్న వారి వద్ద నుంచి గన్ లు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 8,681 లైసెన్డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మరో 17 ఆయుధాలను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద 150 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రాష్ట్రం లోపల 148 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై ఉన్న బ్యానర్లు, పోస్టర్లు, వాల్ పెయింటింగులు తొలగించారు. ఎన్నికలకు సంబంధించి జరిగిన హింసలో ఒకరు మరణించగా, 31 మంది గాయపడినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనా వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై 247 ఎఫ్ఐఆర్?లు నమోదు చేశారు. సి -విజిల్ యాప్ ద్వారా భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతన పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా చూస్తున్నారు. ఇప్పటి వరకు సి ? విజిల్ యాప్ ద్వారా 7838 ఫిర్యాదులు అందాయి. పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ. 17 కోట్ల 85 లక్షల నగదు సీట్ చేశారు. 882 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. 163 గ్రాముల డ్రగ్స్,1236 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా పట్టుబడిన వాటికి సంబంధించి 4337 ఎఫ్ఐఆర్?లు నమోదయ్యాయి.

# వచ్చే వారం ఇంటర్ ఫలితాలు

విజయవాడ, ఏప్రిల్ 6ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఫలితాల పై విద్యాశాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. ఓ వైపు ఎన్నికల హడావుడి, మరోవైపు విద్యార్థులు పరీక్షా ఫలితాల కోసం ఎదురు చూస్తుండటంతో ఇంటర్ ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు రెడీ అవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఏప్రిల్ రెండో వారంలోనే ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేయనుంది. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో ఏప్రిల్ 12-15 ంజూతీతిశ్రీ 12-15 తేదీల మధ్య ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇంటర్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులపై ఎన్నికల ప్రభావం ఉండకుండా సార్వత్రిక ఎన్నికలకు ముందే ఫలితాలను విడుదల చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో విధాన పరమైన నిర్ణయాలన్నీ ఈసీ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఫలితాల వెల్లడిపై ఈసీ అమోదంతో తేదీని ఖరారు చేయనున్నారు. గతంలో మాదిరి ఇంటర్ ఫలితాల విడుదలలో రాజకీయ నాయకులు ప్రమేయం ఏమి ఉండదు. బోర్డు ఉన్నతాధికారులే వాటిని విడుదల చేస్తారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను మార్చి ఒకటో తేదీ నుంచి 30 వరకు నిర్వహించారు. మొదట ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. ఆ వెంటనే విద్యాశాఖ అధికారులు మూల్యాంకనం చేపట్టారు. ఇంటర్మీడియట్‌లో మొదటి ఏడాది, రెండో ఏడాది కలిపి మొత్తం 9,99,698 మంది పరీక్షలు రాశారు. ఇంటర్ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం కోసం 23 వేలమంది అధ్యాపకులను ఇంటర్ బోర్డు నియమించింది. బుధవారంతో ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ ముగిసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఫలితాలను కంప్యూటర్లలో డేటా ఎంట్రీ పూర్తి చేసి విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఏపీలో పదో తరగతి ూ్ఖఅ ఞీవబబీశ్రీబిబ పరీక్షలను 6,30,633 మంది విద్యార్థులు రాశారు. ప్రస్తుతం పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ రాష్ట్రంలోని 26 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. మొత్తం 47,88,738 జవాబు పత్రాల వేల్యూయేషన్ కోసం 25 వేలమంది ఉపాధ్యాయులను నియమించారు. గతంలో వాల్యూయేషన్‌లో రకరకాల సమస్యలు తలెత్తడంతో ఈ ఏడాది ప్రతి కేంద్రంలో గరిష్టంగా 900 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 26న విడుదల చేశారు.

వే 6న పదోతరగతి ఫలితాలు విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం గురువారంతో మూల్యాంకనం పూర్తి కావాల్సి ఉన్నా ముందే జవాబు పత్రాల మూల్యాంకనం కొలిక్కి వచ్చింది. నేడు జవాబు పత్రాల వెరిఫికేషన్, డేటా ఎంట్రీ వంటి పనులను ప్రారంభిస్తారు. ఏప్రిల్ 12వ తేదీ నాటికి ఇంటర్మీడియట్ ఫలితాలను వెల్లడించే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ ఒకటిన ప్రారంభించిన పదో తరగతి మూల్యాంకనం కూడా ఎనిమిదో తేదీతో పూర్తి చేస్తారు. వాటిని కూడా మూల్యాంకనం పూర్తైన వారంపదిరోజుల్లోనే విడుదల చేస్తారు. ఏప్రిల్ 20లోపే పదో తరగతి ఫలితాలు వస్తాయని సెకండరీ బోర్డు వర్గాలు చెబుతున్నాయి. పదోతరగతి, ఇంటర్ ఫలితాలతో పాటు సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల చేస్తారు.

# మన్యంలో వడగాల్పులు



ఏలూరు, ఏప్రిల్ 6 (న్యూస్ పల్స్)ఏపీ, తెలంగాణల్లో ఉక్కపోత, వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. పగలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. ఏప్రిల్ నెల మొదట్లోనే ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలను దాటేశాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నెల నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతోంది. మార్చిలో మధ్య వాతావరణం సాధారణ స్థితికి చేరినా చివరి వారం నుంచి అధిక ఉష్ణోగ్రతలు కొనసాగాయి. ఏప్రిల్ నాటికి అవి మరింత పెరిగాయి. తెలంగాణలో రెండు జిల్లాల్లో తప్ప అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్, జగిత్యాల, నల్గొండ, ఖమ్మం, గద్వాల, ఆదిలాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలను దాటింది. నల్గొండ జిల్లాలోని నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి ఉష్ణోగ్రతల పెరుగుదలతో పాటు రాత్రి పూట ఉక్కపోత ప్రజల్ని వేధిస్తోంది. ఏసీలు, కూలర్లకు డిమాండ్ పెరిగింది. దేశ వ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే రాష్ట్రాల్లో ఏపీ తెలంగాణలు కూడా ఉన్నాయని ఇప్పటికే ఐఎండి ప్రకటించింది. గత ఏడాది కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయనే హెచ్చరికలతో జనం బెంబెలెత్తిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలతో హెచ్చుతగ్గులు కూడా అధికంగా నమోదైనట్లు అమెరికన్ వాతావరణ అధ్యయన సంస్థ క్లైమేట్ ప్రకటించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఏపీ, తెలంగాణల్లో వాతావరణాల్లో వస్తున్న మార్పులను విశ్లేషించారు. 1970 జనవరి 1 నుంచి 2023 జూన్ 30వరకు 53ఏళ్ల పాటు దేశంలో ఉష్ణోగ్రతలలో వచ్చిన మార్పులను అత్యాధునికి పద్ధతుల్లో విశ్లేషించారు. ఈ అధ్యయనంలో దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఏటా ఏప్రిల్ - జూన్ మధ్య కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. యాభై ఏళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. యాభై ఏళ్ల క్రితంతో పోలిస్తే తెలంగాణలో సగటు ఉష్ణోగ్రత 0.5డిగ్రీలు పెరిగింది. ఏపీలో 0.9డిగ్రీలు పెరిగింది. దేశంలో వేగంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ 15వ స్థానంలో తెలంగాణ 28వస్థానంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉంది. అలాగే 130 మండలాల్లో వడగాల్పులు, ఎల్లుండి 5 మండలాల్లో తీవ్ర, 253 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వడగాల్పులు వీచే మండలాలు(130) :-శ్రీకాకుళం 4 , విజయనగరం 19, పార్వతీపురంమన్యం 12, అల్లూరిసీతారామరాజు 4,అనకాపల్లి 13, కాకినాడ 9, తూర్పుగోదావరి 3, కృష్ణా1, ఎన్టీఆర్ 14, గుంటూరు 5, పల్నాడు6, నంద్యాల 19, అనంతపురం 1, వైఎస్సార్ 20 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో43.4ళీఅ, అనంతపురం జిల్లా తెరన్నపల్లి, ప్రకాశం జిల్లా దరిమడుగు, నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరులో 43.3ళీఅ, కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.2ళీఅ అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. అలాగే కడపజిల్లా వీరాపునాయుని మండలంలో తీవ్రవడగాల్పులు, 59 మండలాల్లో వడగాల్పులు వీచాయన్నారు. ప్రజలు వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలి, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి. డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఒఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలని విపత్తుల సంస్థ ఎండి కూర్మనాథ్ సూచించారు.

# సగం మంది ఇతర పార్టీలకే

నెల్లూరు, ఏప్రిల్ 6 పొత్తులో భాగంగా 60, 50, 40 సీట్లంటూ ఊరించి చివరికి జనసేన పార్టీని 21 సీట్లకే పరిమితం చేశాడు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు. అదే మహా ప్రసాదం అని సంతోషపడుతున్నాడు పవన్ కళ్యాణ్. పోని ఇచ్చిన 21 స్థానాలు అచ్చంగా జనసేనకే కేటాయించారా అంటే లేదట. 21 సీట్లలో పార్టీ కోసం పని చేసిన 11 మందికి మాత్రమే టికెట్ కేటాయించారని.. మిగతా 10 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే బరిలో దిగారని తెలిసి జనసేన కేడర్ షాక్ లో ఉంది. ఇలాంటి పొత్తులు, పొత్తు ధర్మం ఎక్కడా చూడలేదు అని వాపోతున్నారు గ్లాస్ పార్టీ నేతలు. పైగా పవన్ దీనిపై మౌనంగా ఉండటం తెలిసే టీడీపీ వారికి టికెట్లు కేటాయించడం వారిని మరింత బాధపెడుతుంది. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన అభ్యర్థులే.. ఇప్పుడు ఎన్నికల ముందు జనసేనలో చేరి టికెట్లు దక్కించుకోవడం చూసి జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ, జనసేన రెండు మిత్రపక్ష పార్టీలే అయినప్పుడు పొత్తులో భాగంగా ఆ సీట్లు టీడీపీనే ఉంచుకుని జనసేనకు వేరే చోట కేటాయించవచ్చు కదా. కానీ ఇలా చేయడం ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు జనసేన పెండింగ్ లో ఉంచిన అవనిగడ్డ, పాలకొండ నియోజకవర్గాల్లో సైతం తాజాగా సోమవారం టీడీపీ నేతలే జనసేనలో చేరి టికెట్లు దక్కించుకోవడం చూసి జనసేన నేతలు మండిపడుతున్నారు.

# సీట్ల మార్పులో వ్యూహాత్మక అడుగులు

ఏలూరు, ఏప్రిల్ 6 ఎన్డీయే కూటమి పొత్తుల్లో భాగంగా సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల మార్పుల్లో జనసేన-టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. టీడీపీతో అంతర్యుద్ధం ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి జనసేనలోకి వచ్చే నేతలకు టికెట్లిస్తూ పవన్ డిఫరెంట్ స్ట్రాటజీ అమలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి అవనిగడ్డ టికెట్ ఆశించిన మండలి బుద్ధప్రసాద్.. పొత్తులో భాగంగా ఆ సీటు జనసేనకు కేటాయించడంతో కండువా మార్చేశారు. జనసేనలోకి జంప్ అయ్యారు. నేరుగా పవన్ కళ్యాణ్‌ను కలిసి కండువా కప్పుకున్నారాయన. ఎట్టకేలకు టికెట్ దక్కించుకున్నారు. జనసేన నుంచి అవనిగడ్డ తరఫున పోటీకి సిద్ధమయ్యారు. మండలి బుద్ధ ప్రసాద్ పోటీపై అధికారిక ప్రకటన విడుదల చేశారు పవన్. బుద్ధా పార్టీలో చేరినప్పటి నుంచి అవనిగడ్డ జనసేన భగ్గుమంటోంది. జనసేన ఓటమికి పనిచేసినవారిని పార్టీలోకి ఎలా తీసుకుంటారంటూ స్థానిక నేతల ఆందోళనలకు దిగారు. గతకొన్ని రోజుల నుంచి పెద్ద ఎత్తున నిరసనగళం వినిపిస్తున్నారు. బుద్ధాకి అవనిగడ్డ సీటు కేటాయిస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామంటూ జనసేన అధిష్టానాన్ని హెచ్చరించారు పార్టీ శ్రేణులు. అయినప్పటికీ మండలి బుద్ధ ప్రసాద్ వైపే

మొగ్గుచూపారు పవన్. ఆయన గెలుపుకోసం అవనిగడ్డ జనసేన నేతలు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. భీమవరం అసెంబ్లీ స్థానానికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును జనసేన అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించారు పవన్. భీమవరం నుంచి తొలుత పవన్‌కల్యాణ్ పోటీ చేయాలని నిర్ణయించినప్పటికీ సమీకరణాల్లో భాగంగా రామాంజనేయులును బరిలోకి దించాలని నిర్ణయించారు. రామాంజనేయులు 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున భీమవరం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో నిలిచిన ఆయన ముక్కోణ పోటీలో ఓడిపోయారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా భీమవరం నుంచి పవన్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఇటీవలే పిఠాపురంలో పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. పిఠాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పవన్ కల్యాణ్ ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పాలకొండ అసెంబ్లీ స్థానం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినా ఇంత వరకు అభ్యర్థిని ప్రకటించలేదు. పార్టీ కార్యకర్తలను కలుపుకొని వెళ్లాలని జయకృష్ణకు సూచించారు పవన్. గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాలకొండ నుంచి మొత్తం ఐదుగురు ఆశావహులు టికెట్ ఆశిస్తున్నారు. దీంతో రాజకీయం ఉత్కంఠ భరితంగా మారింది.

# శనివారం నుంచి శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనం రద్దు..



శ్రీశైలం ఏప్రిల్ 6 విభారే న్యూస్..జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రంలో శనివారంనుంచిఈనెల10వతేదీవరకుఉగాదిమహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందరికీ స్వామివారి దర్శనం కల్పించాలని ఉద్దేశంతో మల్లన్న స్పర్శ దర్శనాన్ని నేటి నుంచి ఉగాది ఉత్సవాలు ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. అందరికీ అలంకార దర్శనమేనని తెలిపారు. కాగా శుక్రవారం వరకు భక్తులందరికీ స్వామివారి స్పర్శ దర్శనాన్ని కల్పించారు.

# శ్రీగిరిపై మోగిన ఉత్సవ భేరి.. ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు..



శ్రీశైలం ఏప్రిల్ 6 విభారే న్యూస్..జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో ఉగాదిఉత్సవభేరిమోగింది. ఉగాదిమహోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, స్థానాచార్యులు,అర్చకులు,వేదపండితులు,అధికారులు సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజలు చేసి కంకణాలు ధరించారు. రుత్వికులు దీక్ష వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వైఎస్సార్సీపీతోనే సంక్షేమ పాలన - బుట్టా ప్రతుల్..



నందవరం ఏప్రిల్ 6 విభారె న్యూస్.శనివారం రోజు నందవరం మండలం,గురజాల గ్రామంలో ప్రచారం బుట్టా ప్రతుల్ ప్రచారం నిర్వహించారు. మొదటగా శ్రీశ్రీ రామలింగేశ్వరవస్వామిని దర్శించుకొని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు బుట్టా ప్రతుల్ మాట్లాడుతూ ఐదేళ్లుగా నిర్విఘ్నంగా పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని,అలాగే తన తల్లి బుట్టా రేణుకను ఎమ్మెల్యేగా,బి వై రామయ్యను ఎంపీగా రెండు ఓట్లు వేసి గెలిపించాలని వైఎస్సార్సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ విన్నవించారు.ఆయన గురజాలలో ఇంటింటి ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి యోగక్షేమాలను తెలుసుకుంటూ టీడీపీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఓటర్లకు తెలిజేస్తూ సంక్షేమ సారథి వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు వీరూపాక్షి రెడ్డి, కె ఆర్ రామకోటేశ్వర్ రెడ్డి,మండల జేసియస్ కన్వీనర్ చాంద్ భాషా,నరహరి రెడ్డి,రాఘవరెడ్డి,వెంకటేశ్వర రెడ్డి, జైపాల్ రెడ్డి,రామచంద్రారెడ్డి,గురజాల సర్పంచ్ వీరస్వామి,నర్సింహారెడ్డి, రాజారెడ్డి,ఈశ్వర్ రెడ్డి,రామచంద్ర,జానులింగన్న,పెద్ద నరసింహులు,వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06-: రాబోయే లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని నంద్యాల జిల్లా బిజెపి కో ఆర్డినేటర్ అభిరుచి మధు స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్నికల పార్టీ కార్యాలయం వద్ద బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ జెండా ఎగురేశారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతు బిజెపి ఆవిర్భావంతో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కసెట్టీ చంద్రశేఖర్. గంగాధర పద్మ. బాలన్న. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో నగర్ వాసులకు అండగా ఉంటా-బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06-నంద్యాల ఆటోనగర్ లో అనేక సమస్యలు తిష్టవేసాయని వాటి పరిష్కారంతో పాటు మీకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు.శనివారం నంద్యాల ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకిర్ అధ్యకతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్బంగా బైరెడ్డి మాట్లాడుతూ నంద్యాల ఆటో నగర్ ఏర్పాటుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేశారని గుర్తు చేశారు. ఆటో నగర్ లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపరిష్కారం కోసం వైసీపీ ప్రభుత్వం పనిచేయలేదని, ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకొని మళ్ళీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకొని ఆటోనగర్ సమస్యలు పరిష్కరించుకుందామని అన్నారు. నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా నా కూతురు డాక్టర్ . బైరెడ్డి శబరి, అసెంబ్లీ అభ్యర్థిగా సీనియర్ నాయకులు ఎన్ ఎమ్ డి ఫరూక్ లు పోటీ చేస్తున్నారని వారిద్దరిని గెలిపించుకుందామ న్నారు. ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకిర్, ఉపాధ్యక్షులు రామతీర్థం బాషా లు మాట్లాడుతూ సుమారు ఐదు వేల కుటుంబాల కార్మికులు ఆటోనగర్ పై ఆధారపడి జీవిస్తున్నారని, ఆటోనగర్ లో అంతర్గత రోడ్లు, మంచి నీటి సౌకర్యం కూడా లేదని, వాటి పరిష్కారం కోసం బైరెడ్డి కృషి చేయాలని కోరారు. టీడీపీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని, నంద్యాల ఎంపీ గా బైరెడ్డి శబరి ని, ఎమ్మెల్యే గా ఫరూక్ ను గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశానికి వందలాది కార్మికులు హాజరయ్యారు

# పొన్నపురంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా కు ఘన స్వాగతం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06- నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 19 వ వార్డు కొన్నాపురంలో కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మ వార్డు ఇన్చార్జ్ పరుచూరి శ్రీరాములు ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఘన స్వాగతం పలికారు. ప్రతిపక్ష పార్టీలపై ప్రతిపక్ష నాయకుల తీరుపై తనదైన శైలిలో విమర్శలు సంధించిన ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి. పేదలపై (టిడిపి) పెత్తందారుల అక్కసు ఇప్పుడే ఇలా ఉంటే పొరపాటున అధికారం చేపడితే పరిస్థితి ఏంటని , ప్రజలకు సేవలు అందించే వాలంటీర్ వ్యవస్థ పై విషం కక్కుతున్న ప్రతిపక్షాల తీరు బాధాకరమని విమర్శించిన ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.నాడు నేడు ద్వారా నంద్యాల నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలను ప్రవేటు పాఠశాలలకు దీటుగా ఏర్పాటు చేశాం.ప్రజల సమస్యల కోసం గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలను పరిష్కరించాం. గ్రామాలలో రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం...అలాగే మిర్చి రైతులు గుంటూరుకు వెళ్లే అవసరం లేకుండా నంద్యాల టెక్కే మార్కెట్ యార్డ్ నందు మిర్చి యార్డు ఏర్పాటు చేశాం నంద్యాలలో పేద ప్రజల కోసం శిల్ప సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే వాటి పై కూడా దుశప్రచారం చేసస్తున్నారు ఏనాడైనా పేద ప్రజల కోసం ఒక సేవా కార్యక్రమాన్ని కూడా నిర్వహించని తెలుగుదేశం నాయకులకు ప్రజల ఓట్లు కావాలి తప్ప ప్రజల కష్టాలని తీర్చాలన్న లేదని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైలంనకు ప్రత్యేక బస్సులు.

కర్నూలు ఏప్రిల్ 6 విభారె న్యూస్..ఈనెల 9వ తేదీ ఉగాది పండుగను పురస్కరించుకొని 8వ తేదీ సోమవారం నుండి 10 వ తేదీ బుధవారం వరకు భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం కర్నూలు జిల్లా నుండి, ఇతర ఐదు డిపోల నుండి శ్రీశైలం, ఇతర శైవ క్షేత్రాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కింది విధంగా 115 బస్సులు నడపడం జరుగుతుంది. 1.రాయచూరు నుంచి శ్రీశైలం - 10 బస్సులు. 2. ఆదోని నుంచి శ్రీశైలం - 30 బస్సులు. 3. ఎమ్మిగనూరు నుంచి శ్రీశైలం - 25 బస్సులు. 4.కర్నూలు నుంచి శ్రీశైలం - 50 బస్సులు.నడపబడును. రద్దీకి అనుగుణంగా ఇంకా బస్సులు పెంచబడును. ఆదోని నుంచి శ్రీశైలం టికెట్ ధర రూ..500, ఎమ్మిగనూరు నుండి శ్రీశైలం టికెట్ ధర రూ. 450, కోడుమూరు నుంచి శ్రీశైలం టికెట్ ధర - రు. 400, కర్నూలు నుండి శ్రీశైలం టికెట్ ధర రూ. 350, నందికొట్కూరు నుండి శ్రీశైలం టికెట్ ధర రూ..300 , ఆత్మకూరు నుంచి శ్రీశైలం టికెట్ ధర రూ. 250, మహానంది నుంచి శ్రీశైలం టికెట్ ధర రూ 350 ధరలు నిర్ణయిం చడమైనది. ప్రయాణికులు సురక్షితమైన సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఆర్టీసీ బస్సుల లోనే ప్రయాణించవల సినది అని జిల్లా ప్రజారవ ణాధికారి టి శ్రీనివాసులు ప్రయాణికులను కోరారు.




# అక్షరాలతో వ్యాపారం చేస్తున్న భాష్యం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి... ఎస్ ఎఫ్ ఐ..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 6 విభారె న్యూస్.విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలు డబ్బులకోసం విద్యార్థులను తరగతి గది బయటనిల్చోబెట్టి పాఠ్యాంశాలు వినకుండా ఫీజులు కడితే రండి లేకపోతే మీ ఇంటి దగ్గరే ఉండండి. అంటున్నా భాష్యం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ ఎమ్మిగనూరు మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు కి వినతి పత్రం ఇచ్చారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనిలో ఉన్న భాష్యం స్కూల్ యాజమాన్యం అక్షరాలతో వ్యాపారం చేస్తున్నాయని అన్నారు ఫీజులు కట్టకపోతే విద్యార్థులను ఇంటికి పంపడం క్లాస్ రూమ్ బయట నిలిచోబెడుతూ విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తున్నా భాష్యం స్కూల్ ను తక్షణమే సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


# బీవీ జయ నాగేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 6 విభారె న్యూస్.శనివారం రోజు బీవీ జయ నాగేశ్వర రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టణంలో గల మాబు శుభాని దర్గా యందు ప్రత్యేక దువా చేసి,ఎం.బి.చర్చి యందు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని సర్వమత ప్రార్థనలు నిర్వహించి ఎమ్మిగనూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డా బి వి జయనాగేశ్వర రెడ్డి అందరి ఆశీర్వాదాలు పొందారు.

# చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరం

## వైసిపి ఎమ్మెల్సీ ఇక్బాల్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06-అనుభవజ్ఞుడు చంద్రబాబు సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరమని వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎన్ ఎమ్ డి ఫరూక్ తో కలసి శనివారం విలేకరుల తో మాట్లాడారు. వైసిపిలో గౌరవం లేకపోవడంతో బయటికి వచ్చేసానని తెలిపారు. నంద్యాల సొంత జిల్లా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటాను. అనుభవజ్ఞుడు చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరం ఉంది. మైనార్టీలకు ఒక్క పథకాన్ని అమలు చేయని వైసిపి లో ఉండ లేక బయట కు వచ్చిన. ఫార్మేట్ లో ఎమ్మెల్సీకి.ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినాను. మండలి చైర్మన్ తో మాట్లాడిన రాజీనామాను ఆమోదించాలని కోరామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తామైనార్టీలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు .

# చెత్త తొలగించేది ఎప్పుడో

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 06-పట్టణంలో 14 వ వార్డు సరస్వతి నగర్ యందు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి మురుగు ముందుకు పారడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద అధికమై రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవిం చినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190